www.netifocusnews.com
నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
తెలంగాణ జిల్లాలు
బుధవారం 24, సెప్టెంబర్ 2025
పేజీలు 4

రాజమహల్‌కు పూర్వ వైభవం కల్పించండి



4

# పూలోత్సవ శోభ

## బతుకమ్మ సంబరాలకు శ్రీకారం




జనగాం, (నేటి ఫోకస్ న్యూస్)-సెప్టెంబర్ 23:

**తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయ పండుగ బతుకమ్మ. పూలతో దేవుని కొలుస్తున్నా, పూలనే దైవంగా ఆరాధించే ఏకైక పండుగగా బతుకమ్మ ప్రత్యేకత సంతరించుకుంది. ఎంగిలిపూలతో ఈ వేడుకలు తొమ్మిది రోజులపాటు ఊరూవాడా సందడిగా సాగనున్నాయి.**

### ప్రకృతి పూలతో బతుకమ్మ అందాలు..

గునుగు, తంగేడు, చామంతి, జాజి, రుద్రాక్ష, కట్ల, గానుగ, బీర, గుమ్మడి, మందార వంటి పూలను అడవుల నుండి సేకరించి ఇత్తడి తాంబాలంలో పేర్చిన బతుకమ్మలు అలరారుతున్నాయి. మహిళలు గౌరమ్మను ఆరాధిస్తూ పాడే బతుకమ్మ పాటలు జీవన సౌందర్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

2

### తీరొక్క పూలతో ఆట పాటల సందడి..

ప్రతి సాయంత్రం గ్రామాల ప్రధాన కూడళ్లలో తీరొక్క పూలతో తయారైన బతుకమ్మలను సమకూర్చి, చప్పట్లు కొడుతూ, పాటలు పాడుతూ, వలయాకారంగా తిరుగుతూ మహిళలు ఆనందోత్సాహాలతో ఆడిపాడుతారు. ఆ పూల అందాలు, గాజుల చప్పట్లు, ఊరంతా కిలకిలారావాలతో పండుగ వాతావరణం నెలకొంటుంది.







# పూలోత్సవ శోభ

(మొదటి పేజీ తరువాయి)

**తొమ్మిది రోజులు.. తొమ్మిది నైవేద్యాలు..**

1. మొదటి రోజు–ఎంగిలిపూల బతుకమ్మ: నువ్వులు, బియ్యంపిండి, నూకలతో నైవేద్యం.
2. రెండో రోజు–అటుకుల బతుకమ్మ: సప్పిడి పప్పు, బెల్లం అటుకులు.
3. మూడో రోజు–ముద్దపప్పు బతుకమ్మ: పాలు, బెల్లం, ముద్దపప్పుతో.
4. నాలుగో రోజు–నానెబియ్యం బతుకమ్మ: నానబెట్టిన బియ్యం, పెరుగు తో.
5. ఐదో రోజు–అట్ల బతుకమ్మ: అట్లు లేదా దోశలు అమ్మవారికి నైవేద్యం.
6. ఆరో రోజు–అలిగిన బతుకమ్మ: ఆశ్వీయుజ పంచమి రోజున బతుకమ్మ పేర్చరు.
7. ఏడో రోజు–వేపకాయల బతుకమ్మ: బియ్యంపిండితో వేపకాయలు చేసి సమర్పణ.
8. ఎనిమిదో రోజు–వెన్నముద్దల బతుకమ్మ: వెన్న, నువ్వులు లేదా నెయ్యి, బెల్లంతో.
9. తొమ్మిదో రోజు–సద్దుల బతుకమ్మ: ఐదు రకాల అన్నాలు (పెరుగన్నం, పులిహోర, లెమన్రైస్, కొబ్బరన్నం, నువ్వులన్నం).

**సద్దుల బతుకమ్మతో ముగింపు..**

సద్దుల బతుకమ్మతో వేడుకలు ఘనంగా ముగుస్తాయి. అమ్మవారికి ఐదు రకాల నైవేద్యాలను సమర్పించి, బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేస్తారు. "పోయిరా బతుకమ్మ.. వెళ్లిరావమ్మ.. మళ్లీ వచ్చే ఏడాది తిరిగి రావమ్మా" అని పాటలతో వీడ్కోలు పలుకుతారు.

**పూలను కొలిచే పండుగ..**

ప్రపంచంలో పూలను కొలిచే ఏకైక పండుగ బతుకమ్మ. ఆడపడుచులు పుట్టింటికి వెళ్లి నిర్వహించుకునే వేడుక ఇది. ఇటు పుట్టినిల్లు, అటు మెట్టినిల్లు అందరూ సఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటాం.

**తెలంగాణ సంస్కృతి మూలాలు..**

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రజలు బతుకమ్మ పండుగను ఉత్సహంగా జరుపుకుంటారు. ఈ పండగతో తెలంగాణ సంస్కృతి మూలాలు తెలుసుకునే గొప్ప అవకాశం ఉంటుంది. ఇలాంటి సాంస్కృతి నేటి సమాజానికి ఎంతో అవసరం. మన పండగకు ప్రపంచ ఖ్యాతి వచ్చింది.



# జీఎస్టీ తగ్గింపు ఎన్నికల డ్రామా

- జీఎస్టీని ఆయుధంగా ఉపయోగించి ప్రజలను దోచారు
- పన్నులు పెట్టినవారు, తగ్గించినవారు, సంబరాలు చేసుకునేవారు ఒకరే
- పెట్రోల్, డీజిల్ జీఎస్టీలో చేర్చని కేంద్రం
- మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–సెప్టెంబర్ 23:**
గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రధాని నరేంద్ర మోడీ జీఎస్టీపై చేసిన ప్రకటనను తీవ్రంగా విమర్శించారు. జీఎస్టీ తగ్గింపు అంతా ఎన్నికల డ్రామా మాత్రమేనని, ఇంకా జీఎస్టీ ఫలాలు పేద ప్రజలకు అందలేదని ఆయన ధ్వజమెత్తారు. జీఎస్టీని ఆయుధంలా వాడి దేశ ప్రజలను దోచుకున్నారని వాళ్లే పన్నులు వేసి వాళ్లే తగ్గించి, ఇప్పుడు సంబరాలు చేసుకుంటున్నారని దీన్ని మించిన మూర త్వం మరొకటి లేదని దుయ్యబట్టారు. 8 ఏళ్లుగా జీఎస్టీ పేరుతో పేదల రక్తం తాగి ఇప్పుడు లబ్ధి చేసినట్టుగా బీజేపీ నాయకులు బిల్డప్ ఇస్తున్నారని ఆయన ఫైర్ అయ్యారు. జీఎస్టీ అంటే "గబ్బర్ సింగ్ ట్యాక్స్" అని రాహుల్ గాంధీ అప్పుడే చెప్పారని, శ్లాబులు కాకుండా రేట్లు తగ్గించాలని ఆయన అప్పుడే డిమాండ్ చేసినా కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని పొన్నం ఆరోపించారు. తెచ్చిన జీఎస్టీలో 18, 24 శ్లాబుల్లో ప్రజలు అధికంగా వినియోగించే వస్తువులనే చేర్చారని, దీని వలన నిత్యావసర వస్తువుల ధరలు డబుల్ అయ్యాయని మండిపడ్డారు. జీఎస్టీ రొట్టెలు తినే పేదవాడి మీద ఎక్కువ, లగ్జరీ వస్తువుల మీద మాత్రం తక్కువగా ఉండే విధంగా అమలులోకి తెచ్చారని, పెట్రోల్–డీజిల్ జీఎస్టీలో చేర్చాలని రాష్ట్రాలు పునరావృతంగా విజ్ఞప్తి చేసినా ఇప్పటివరకు చేయలేదని ఆయన విమర్శించారు. కేంద్రం చివరకు శవపేటికలకు కూడా జీఎస్టీ వేశారని, శవాలను దహనం చేసే సమయంలో చెల్లించే సొమ్ముపై కూడా జీఎస్టీ వసూలు చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి వచ్చినా పాత ధరలకే వస్తువులు విక్రయిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, శవపేటికలు, పసిపిల్లల తినుబండారాలపైనా జీఎస్టీ వేశారని ఆయన మండిపడ్డారు. జీఎస్టీ ట్యాక్స్‌తో ఏదైనా మంచిపని చేశారా? అని నిలదీశారు. ఆర్థిక సంక్షోభం నుండి తప్పించుకోవడానికే మోదీ ప్రభుత్వం వెనక్కి తగ్గిందని ఆరోపించారు. జీఎస్టీ మార్పులతో తెలంగాణకు రూ. 7వేల కోట్ల నష్టం వస్తోందని, దీన్ని పూడ్చే బాధ్యత కేంద్రప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. తెలంగాణ ఎంపీలు, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి ఈ నష్టాన్ని ఎలా పూడ్చుతారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రం పెద్దన్న పాత్ర పోషించి అండగా ఉండాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం ఒక చేతితో ఇచ్చి మరొక చేతితో తీసుకునే విధంగా వ్యవహరిస్తోందని జీఎస్టీ కౌన్సిల్‌లో కేంద్రానిదే పెత్తనం ఉందని దీన్ని ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పాటు చేయాలని పొన్నం డిమాండ్ చేశారు. జీఎస్టీ తగ్గించి "మీ చావు మీరు చావండి" అన్నట్లు కేంద్రం వ్యవహరిస్తోందని, సంక్షేమం మొత్తం రాష్ట్రాల మీద రుద్దుతూ కేంద్రం మాత్రం సెస్‌ల పేరుతో దండుకుంటోందని ఆయన విమర్శించారు. జీఎస్టీ తీసుకొచ్చినప్పుడు 10 సంవత్సరాల పాటు రాష్ట్రాల నష్టాన్ని కేంద్రం భర్తీ చేస్తుందని చెప్పినా, అది పూర్తిగా చేయలేదని ఆరోపించారు. ఇప్పుడు తెలంగాణకు వస్తున్న రూ.7 వేల కోట్ల నష్టంపై ఎంత ఇస్తారో కేంద్రం ప్రామిస్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# సాంస్కృతిక చైతన్యానికి ప్రతీకగా బతుకమ్మ పండుగ

- ప్రియదర్శిని ఉమెన్స్ కాలేజీలో అంగరంగ వైభవంగా బతుకమ్మ పండుగ
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినులు, అధ్యాపకులు





**ఖమ్మంరూరల్, (నేటి ఫోకస్‌న్యూస్)–సెప్టెంబర్ 23:**
ప్రియదర్శిని మహిళల సాంకేతిక కళాశాలలో బతుకమ్మ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ ఆడబిడ్డల ఆచార సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ పండుగలో అధ్యాపకులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పూలతో అందంగా అలంకరించిన వివిధ రకాల బతుకమ్మలను తయారు చేసి, మహిళలు పాటలు పా డుతూ నృత్యాలను చేస్తూ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణం ఆనందోత్సాహాలతో మార్మోగింది. కళాశాల చైర్మన్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీ క, పూలతో అలంకరించిన బతుకమ్మ ఆడబిడ్డల ఆరాధనకు, ఆనందానికి చిహ్నమని, ఈ పండుగ ప్రకృతిని, పూల అందాన్ని స్మరింపజేస్తుందని, విద్యార్థులు ఇలాంటి పండుగలను ఘనంగా జరుపుకోవడం చాలా ఆనందకరమని, సంప్రదాయాలను కొనసాగించడం ద్వారా మన సంస్కృతిని తరతరాలకు అందించవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.గోపాల్ మాట్లాడు తూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుందని, పూలతో అలంకరిం చిన బతుకమ్మ ప్రకృతిని గౌరవించే మన సంప్రదాయా నికి గుర్తు అని, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని, సాంప్రదాయ పాటలు, నృత్యాలతో కళాశాల వాతావర ణాన్ని ఆనందోత్సాహాలతో నింపారు. ఇలాంటి పం డుగలు విద్యార్థుల్లో సమాజం పట్ల అనుబంధాన్ని, సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని, బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించినందుకు అందరికీ అభినందనలు తెలిపారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ మాట్లాడుతూ బతుకమ్మ పండు గ కేవలం సాంప్రదాయ వేడుక మాత్రమే కాకుండా, ప్రకృతిని, పూలను గౌరవించే, సాంస్కృతిక పరిరక్షణకు ప్రతీక. విద్యార్థులు ఇలాంటి సంప్రదాయాలలో పాల్గొ నడం ద్వారా మన సంస్కృతిని అవగాహన చేసుకుంటారు, గౌరవిస్తారని తెలిపారు. ఈ కార్యక్ర మంలో విభాగాధిపతులు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్, అధ్యాపకులు, కల్చరల్ ఇంచార్జ్, స్పోర్ట్స్ ఇన్చార్జ్, మరియు విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# యువకుడు గల్లంతు

### రెస్క్యూ టీం తో గాలింపు చర్యలు, లభించని ఆచూకీహో

### గంట్లకుంట లో ఘటన,

### అవుతాపురం లో విషాదం

పెద్దవంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు సెప్టెంబర్ 23

పెద్దవంగర మండలం, గంట్లకుంట గ్రామంలోని చింతల కుంటలో ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఎస్సై క్రాంతి కిరణ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అవుతాపురం గ్రామానికి చెందిన కమ్మగాని అశోక్ (35) కేబుల్ ఆపరేటర్ తో పాటుగా, ఆటో నడుపుతూ భార్య, తన ఇద్దరు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నారు. డిష్ వైర్ మరమ్మత్తు కు గురైందని ఇంట్లో చెప్పి అశోక్ మంగళవారం



ఉదయం బయటికి వెళ్లాడు. గంట్లకుంట గ్రామంలోని చింతల కుంట లోని ఓ స్తంభానికి కట్టిన డిష్ వైరు తెగిపోయింది. మరమ్మతులు చేయడం కోసం నెల్లికుదురు మండలం బ్రాహ్మణ కొత్తపల్లి గ్రామానికి చెందిన పెరుమాండ్ల శ్రీనివాస్, మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి తెప్ప సహాయం తో మరమ్మతుల కోసం కుంట లోకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు తెప్ప మునగడంతో అశోక్ ఈత రాక కుంట లో మునిగి గల్లంతయ్యాడు. సంఘటన స్థలానికి తహశీల్దార్ వీరగంటి మహేందర్, ఎస్సై క్రాంతి కిరణ్ చేరుకుని ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. రెస్క్యూ టీం, గజ ఈత గాళ్లతో రాత్రి వరకు గాలించిన అశోక్ ఆచూకీ లభించలేదు. ఘటన పై అతని భార్య కనకతార ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అశోక్ ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో అవుతాపురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



## కాళీమాత రూపంలో మెరిసిన.. గారే సాత్విక

జగదీర్గుట్ట, సెప్టెంబర్ 23 నేటి ఫోకస్ న్యూస్

:అశోక మెమోరియల్ చాణక్య హైస్కూల్‌లో దేవీ నవరాత్రి వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. చిన్నారులు వివిధ దేవతల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ముఖ్యంగా కాళీమాత వేషంలో దర్శనమిచ్చిన గారే సాత్విక అందరినీ మంత్రముగ్ధులను చేసింది. ఆమె హావభావాలు, ఆత్మవిశ్వాసం చూసి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రశంసల వర్షం కురిపించారు.

## ప్లాస్టిక్ నిషేధం పై ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ



తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు సెప్టెంబర్ 23

ప్రభుత్వ జూనియర్ కళాశాల తొర్రూరు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం చింతలపల్లి గ్రామంలో నిర్వహించచన ప్రత్యేక క్యాంపు 4వ రోజు కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధం పై భారీగా ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలను గ్రామ ప్రజలకు వివరించారు. ప్లాస్టిక్ వాటర్ బాటిల్, ప్లాస్టిక్ వాటర్ క్యాన్స్ మరియు ప్లాస్టిక్ టీ కప్పులలో టీ తాగు కూడదని గ్రామ ప్రజలకు ఎన్ఎస్ఎస్ వాలెంటైర్స్ మరియు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నారాయణ, చింతలపల్లి గ్రామపంచాయతీ సెక్రటరీ ఆంజనేయులు గ్రామస్తులకు సూచించారు.

## నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ కేటాయించాలి

తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు సెప్టెంబర్ 23

డివిజన్ కేంద్రంలోని గోపలగిరి రోడ్డులో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులైన నిరుపేదలకు వెంటనే కేటాయించాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమాక్రసీ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న డిమాండ్ చేశారు.మంగళవారం డివిజన్ కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని హామీలు చేసిన ప్రస్తుత పాలకులు ఈ వాగ్దానాలను అమలు చేయలేకపోతున్నారని,ఈ ఇళ్లు నిర్మాణం పూర్తయి దాదాపు రెండు సంవత్సరాలు దాటిన పేదలకు



కేటాయించకపోవటం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి బాధ్యత తీసుకొని అర్హులైన నిరుపేదలకు వెంటనే ఇండ్లు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో పేదల హక్కుల కోసం పోరాటం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు చిర్ర యాకన్న,ఎస్.కె సాజన్ పాషా,సంపత్, దొనికే ఎల్లయ్య, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఉషా క్రీడా ఎస్ జి ఎఫ్ అండర్ 19 బాల బాలికల పోటీలు

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫోకస్ న్యూస్ సెప్టెంబర్. 23



ఉషా క్రీడలో పథకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అండర్ 19 ఎస్జీఎఫ్ సెక్రటరీ గణపతి అన్నారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలో గల కిసాన్ భవన్ లో ఉమ్మడి మెదక్ జిల్లా ఉషా క్రీడా ఎస్ జీఎఫ్ అండర్ 19 బాల, బాలికల పోటీలు నిర్వహించారు. సంగారెడ్డి మెదక్ సిద్దిపేట జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మహబూబాబాద్ జిల్లాలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తితో శ్రమించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో పిడి ధనరాజ్, ఉషా ఉమ్మడి మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య, మాస్టర్ సాజిద్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లి చేతుల మీదుగా షాపును ప్రారంభింపచేసిన తనయులు

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫోకస్ న్యూస్సెప్టెంబర్. 23



సదాశివపేట లోని శాస్త్రి రోడ్డు లో ఏ వన్ బ్యాంగిల్స్ స్టోర్ ను రీ ఓపెనింగ్ చేయడం జరిగింది. మాతృదేవోభవ అనే పదాన్ని అక్షరాల చూయించిన ఏ వన్ బ్యాంగిల్ స్టోర్ ఏర్పాటుదారులు అబ్దుల్ వహాబ్, అబ్దుల్ రౌఫ్ లు వారి తల్లి అమీనాభి చేతుల మీదుగా బ్యాంగిల్స్ స్టోర్ ను రీఓపెనింగ్ రిబ్బన్ కటింగ్ చేయించడం జరిగింది.

ఈ సందర్భంగా అబ్దుల్ వహాబ్, అబ్దుల్ రౌఫ్ లు మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు చిన్నప్పటి నుండి ఎన్నో కష్టాలు ఎదుర్కొని మమ్మల్ని వ్యాపారంలో ఉన్నత స్థాయిలోకి తీసుకురావడం జరిగింది అన్నారు. తమ తల్లి ద్వారా షాపును రీఓపెనింగ్ చేయడం అనేది చాలా సంతోషకరంగా భావిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో ఎండి వాజిద్, అబ్దుల్ అయూబ్, అబ్దుల్ రెహమాన్, ఎండి రజవాన్, ఎండి అక్బర్, ఎండి నిజాం, సాయి కృష్ణ, సోలాపురం నవీన్ కుమార్, సోలాపురం శ్రావణ్ కుమార్, రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# బండారు వారి వీధిలో గాయత్రీ దేవిగా దుర్గాదేవి

**-భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు, పూజలు చేసిన మహిళలు.**

**-హనుమాన్ టేకిడిలో ఆకట్టుకున్న భవానీ దీక్షలు.**

**-మాజీ కౌన్సిలర్ బండారు కృష్ణ పర్యవేక్షణలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు.**





వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:

దేవీ నవరాత్రులను పురస్కరించుకొని వనపర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన వివిధ మండపాల్లో దుర్గాదేవి వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం రెండవ రోజు అయిన అమ్మవారిని భక్తులకు నచ్చిన రూపాల్లో అలంకరించి పూజించారు. వాసవి కన్యకా పరమేశ్వరి, చౌడేశ్వరి దేవి, రామాలయంలో అమ్మవారు గాయత్రీ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని గోపాల్పేట రోడ్డు 15వ వార్డులో గల బండారు వీధిలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి ప్రతిమకు ప్రవీణ్ అర్చన దంపతులు అమ్మవారికి కుంకుమార్చన, లలిత సహస్ర నామార్చన చేశారు. అలాగే స్థానిక మహిళలు, భవాని దీక్ష పరులు అత్యంత భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ టేకిడి లో గల బాల ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతిష్టించిన అమ్మవారితో పాటు మరో చోట ప్రతిష్టించిన దుర్గాదేవి మండపాలను స్థానిక 15వ వార్డు మాజీ కౌన్సిలర్ బండారు కృష్ణ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దీక్ష పరులు, మహిళలు అమ్మవారి స్తుతి వైభవాన్ని సామూహికంగా స్తుతించారు. బ్రాహ్మణుల వేదమంత్రాలు, భక్తుల పాటల నడుమ దుర్గాదేవి ప్రతిమకు పంచామృత అభిషేకాలు చేసి అష్టోత్తర, శతనామావళితో పూజించారు. ఆ తర్వాత దీక్షపరులకు, అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులకు మండపంలో అన్న ప్రసాద వితరణ చేశారు. ప్రతిరోజు వివిధ రూపాల్లో అమ్మవారిని ఆరాధిస్తూ నవరాత్రులు ముగిసే వరకు నిత్యాన్న దాన కార్యక్రమాలు చేపడతామని మాజీ కౌన్సిలర్ బండారు కృష్ణ, భవానీ దీక్షపరులు, మండప నిర్వహకులు తెలిపారు. అనంతరం మండపంలో పలువురు మహిళలు ప్రత్యేకంగా అమ్మవారికి అర్చనలు చేసి వేద పండితుల, భవానీ దీక్షపరుల ఆశీర్వచనం పొందారు. కార్యక్రమంలో బండారు వీధి మండప నిర్వహకులు బండారు సతీష్, బండారు నరేందర్, గంగాధర్, బండారు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# కొండచిలువ కలకలం

**-సురక్షితంగా బంధించిన కృష్ణ సాగర్**

వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:



వనపర్తి శివారులోని చిట్యాల రోడ్డులో గల పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న పాత ఇనుప సామాను గోదాంలో కొండచిలువ కలకలం రేపింది. ఇనుప సామాన్ గోదాం యజమాని తాజుద్దీన్ మంగళవారం సాయంత్రం షాపు తెరవగా అందులోంచి 6 అడుగుల కొండచిలువ బుసలు కొడుతూ భయకంపితుడిని చేసింది. దీంతో ఆయన వెంటనే సాగర్ స్నేక్ సొసైటీ జిల్లా అధ్యక్షులు కృష్ణసాగర్ కు సమాచారం ఇవ్వడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న ఆయన సురక్షితంగా కొండచిలువను బంధించి ఫారెస్ట్ అధికారుల సూచన మేరకు అడవిలో వదిలిపెట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు కుమార్ సాగర్, అవినాష్ పాల్గొన్నారు.

# రాజమహల్ కు పూర్వ వైభవం కల్పించండి



**-విద్యాసంస్థల బలోపేతానికి నిధులు మంజూరు చేయాలి**

**-తగినంత బడ్జెట్ కేటాయిస్తే తీరనున్న అద్దె భవనాల ఇబ్బందులు**

**-ముఖ్యమంత్రికి ప్రత్యేక విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి**



వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:

వనపర్తి జిల్లాకు తలమానికంగా ఉన్న రాజమహల్ (పాలిటెక్నిక్ కళాశాల) కు పూర్వవైభవం రానుందని ఎమ్మెల్యే మేఘారెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధితోపాటు జిల్లాలో ఉన్న వివిధ విద్యాసంస్థల నూతన భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని మంగళవారం సీఎం రేవంత్ రెడ్డిని ప్రత్యేకంగా కలిసి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల మరమ్మతులతో పాటు వెనక ఉన్న హాస్టల్ భవనాలు, పెద్దమందడి మండలంలోని వెల్టూర్ లో కొనసాగుతున్న మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలకు సొంత భవనం, తాత్కాలిక భవనాల్లో కొనసాగుతున్న మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల,బాలుర పాఠశాలల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రంలో పేర్కొనగా ఆయన వెంటనే స్పందిస్తూ త్వరలో నిధులు మంజూరు చేస్తూ జీవో జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే మేఘారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# తెలంగాణలో స్థానిక సమరానికి సర్కార్ సై..

**నాలుగైదు రోజుల్లో నోటిఫికేషన్?**

**స్థానిక ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వ కసరత్తు ముమ్మరం**

**నాలుగైదు రోజుల్లోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం**

**బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు నిర్ణయం**

**నేటి సాయంత్రానికి పూర్తికానున్న రిజర్వేషన్ల ప్రక్రియ**

**2024 కుల సర్వే ఆధారంగా బీసీలకు రిజర్వేషన్ల కేటాయింపు**

**సీల్డ్ కవర్‌లో ప్రభుత్వానికి అందనున్న తుది జాబితా**

హైదరాబాద్, నేటి ఫోకస్ న్యూస్:

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూనే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించిన సర్కార్, అందుకు సంబంధించిన ప్రక్రియను దాదాపు పూర్తి చేసింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో రిజర్వేషన్ల ఖరారును ముమ్మరం చేసిన అధికారులు, మంగళవారం సాయంత్రానికల్లా తుది జాబితాను ప్రభుత్వానికి సీల్డ్ కవర్‌లో అందించనున్నారు. ఈ జాబితాను పరిశీలించిన వెంటనే, నాలుగైదు రోజుల్లోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం.

కుల సర్వే ఆధారంగా బీసీ రిజర్వేషన్లు

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ రిజర్వేషన్లను ఖరారు చేస్తున్నారు. ఇందులో భాగంగా షెడ్యూల్డ్ కులాలకు (ఎస్సీ) 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోనుండగా, బీసీలకు మాత్రం ఇటీవల నిర్వహించిన 2024 కుల సర్వే వివరాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. గ్రామాల్లో వార్డు సభ్యులు, సర్పంచ్ మొదలుకొని జడ్పీ ఛైర్‌పర్సన్ వరకు మొత్తం ఆరు స్థాయిల్లో కమిషన్ సిఫార్సులు చేసింది. ఆయా ప్రాంతాల్లోని బీసీ జనాభా ఆధారంగా రిజర్వేషన్లను కేటాయించనున్నారు.

ప్రత్యేక జీఓతో ఎన్నికలకు సన్నాహాలు

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో ఆమోదించిన బిల్లుపై కేంద్రం నుంచి ఇంకా ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. ఈ నేపథ్యంలో, హైకోర్టు విధించిన సెప్టెంబర్ 30 గడువు సమీపిస్తుండటంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకుంది. రిజర్వేషన్లపై ప్రత్యేకంగా ఒక ప్రభుత్వ ఉత్తర్వు (జీఓ) జారీ చేసి, ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని భావిస్తోంది. ఈ ప్రక్రియకు కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున, గడువు పొడిగించాలని హైకోర్టును కోరే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కీలక పరిణామాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి త్వరలోనే ఒక ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నారని సమాచారం.

రాష్ట్రవ్యాప్తంగా 12,760 గ్రామపంచాయతీలు, 1,12,534 వార్డులు, 5,763 ఎంపీటీసీలు, 565 ఎంపీపీలు, 565 జడ్పీటీసీలు, 31 జడ్పీ చైర్‌పర్సన్ స్థానాలకు రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ సోమవారం రాత్రి వరకు ముమ్మరంగా సాగింది. వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఎంపీడీవోలు, సర్పంచ్, ఎంపీటీసీల రిజర్వేషన్లను ఆర్డీవోలు, ఎంపీపీ, జడ్పీటీసీలకు జిల్లా కలెక్టర్లు, జడ్పీ చైర్మన్ల రిజర్వేషన్లను పంచాయతీరాజ్ శాఖ కమిషనర్లు ఖరారు చేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు.